క్లుప్తంగా

గుండ్లపల్లి నాయకులకు బహుమతి అందజేత


చెక్కు అందజేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో అత్యధిక మెజార్టీ వచ్చింది. ఈ సందర్భంగా గురువారం నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి సొంతంగా రూ.50 వేలను జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య చేతుల గుండ్లపల్లి గ్రామ పార్టీ శ్రేణులకు బహుమతిగా అందజేశారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో గుండ్లపల్లి గ్రామంలో కోమటిరెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. జె.కె రాజు, ఎంపీటీసీ సహదేవ్, మాజీ సర్పంచ్ పనస శంకర్, గ్రామశాఖ అధ్యక్షుడు రేగట్టి నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకుడు


గుంతలను పూడుస్తున్న యువకుడు

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఎదురుగా మునుగోడు–చౌటుప్పల్ ప్రధాన రాహదారిపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను ఓ యువకుడు మట్టిపోసి పూడ్చివేశాడు. రోడ్డుపై గుంతలు ఉండడంతో అనేక మంది వాహనదారులు ఆ గుంతల వద్దకు రాగానే కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. దానిని గమనించిన మునుగోడు పట్టణానికి చెందిన గణేశ్ అనే యువకుడు తన సొంత డబ్బులతో ఒక ట్రాక్టర్ మట్టిని తీసుకొచ్చి గుంతల్లో పోసి రోడ్డును చదును చేశాడు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రభుత్వ అధికారులు చేయాల్సిన పనిని ఓ యువకుడు తన సొంత డబ్బులు ఖర్చుచేసి గుంతలు పూడ్చివేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న బోగి శాంతారావు

శాలిగౌరారం: దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ ఇంజనీర్, క్రైస్తవ బోధనల ముఖ్య ప్రసంగికుడు బోగి శాంతారావు అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గోదల సత్తిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గోదల వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్‌హాల్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్స్ పెలోషిప్ ప్రతినిధులు బోడ ఇజ్రాయిల్, తాందారి సీమోను, వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు

నల్లగొండ: సీఎంగా రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో పదవీ ప్రమాణ స్వీకారం చేయడంతో నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. క్లాక్ టవర్ సెంటర్లో పార్టీ శ్రేణులు డ్యాన్స్‌లు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలు మాట్లాడుతూ దొరల పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. కేసీఆర్ నియంత పాలనను ప్రజలు తరిమికొట్టారని అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం పట్ల ప్రజలకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఖలీల్, సమద్, ఇబ్రహీం, కరుణాకర్‌రెడ్డి, ఇంతియాజ్, జూలకంటి శ్రీనివాస్, నాయకులు నల్లగొండ అశోక్, ఇటికాల శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, ఇంతియాజ్ హుస్సేన్, అఫ్జల్ ఖాన్, గుండెబోయిన వెంకన్న, ఏదుళ్ళ శ్రీధర్‌రెడ్డి, బాబా, అనిల్, వీరబ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్, ఎగ్గడి సుజాత, సూరెడ్డి సరస్వతి, లలిత, లింగమ్మ, పద్మ పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ..

నల్లగొండ టూటౌన్ : సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఎదుట గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏర్పుల శ్రవణ్‌కుమార్, కల్పన, శిరీష, రోహిణి, శ్రీవాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కనగల్ మండలంలో..

కనగల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం పట్ల గురువారం కనగల్ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో


నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


కనగల్ : స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

స్థానిక సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు హఫీజ్, ఉప సర్పంచ్ పెద్దులు, రాయల శ్రవణ్, కేవీఆర్ సోషల్ మీడియా అధ్యక్షుడు పోలె విజయ్‌కుమార్, మాచర్ల దశరథ, ప్రేమయ్య, నెలగొందరాశి పెద్దులు, మునగాల శ్రీహరి, ఏడుకొండలు, యాదగిరి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి పేరిట పూజలు

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేయడంతో వారి పేరిట దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ముఖ్య అర్చకులు శ్రీ చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు, అర్చకులు గాదె దామోదర్ రావు, నాగరాజు సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్లు చనగాని లింగస్వామి, కూసం ఉపేందర్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ జినుకుంట్ల నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన కుంభం

మునుగోడు: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఇరువురు కృషి చేయాలని, అదేవిధంగా మునుగోడుకు సాగు నీరు అందించాలని కోరారు.


నార్కట్‌పల్లి మండల కేంద్రంలో..

నార్కట్‌పల్లి, బి. వెల్లంలలో సంబరాలు

నార్కట్‌పల్లి : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పురపాలక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రం, కోమటిరెడ్డి సొంత గ్రామం బి వెల్లంలలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అల్లుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, యానాల రాంరెడ్డి, సట్టు సత్తయ్య, వెల్లంల గోపాల్‌రెడ్డి, రాధారపు భిక్షపతి, వేముల నర్సింహ, సత్తయ్య, మట్టిపల్లి శ్రీను, ఇరుకుల భిక్షమయ్య, శిలువేరు గిరి, తోడుసురి నర్సింహ, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, సమద్, నల్లబోతు సత్తయ్య, ధర్మయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండలో..


మునుగోడు : కోమటిరెడ్డి బ్రదర్స్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


నల్లగొండ టూటౌన్ : స్వీట్లు తినిపించుకుంటున్న విద్యార్థి సంఘం నాయకులు


కనగల్ : రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు మంగళపల్లి విద్యార్థులు

నకిరేకల్ :ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో ఈ నెల 8 నుంచి 9 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కక్క వీరారెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య గురువారం తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న శివాణి, అనిల్, వేణు, ఎనిమిదో తరగతి చదువుతున్న శివ, శ్రీవిద్య, శివాని, అను ఎంకయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు, సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు అభినందించారు.

మాదిగ జేఏసీ పట్టణ అధ్యక్షుడిగా రమేష్



మునుగోడు: తెలంగాణ మాదిగ జేఏసీ మునుగోడు పట్టణ అధ్యక్షుడిగా జేడిమడ్ల రమేష్ నియమితులయ్యారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి చంద్రస్వామి గురువారం రమేష్‌కు నియామక పత్రం అందజేశారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు

రామన్నపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఈ నెల 8,10,11, 13 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జలేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మునిపంపుల, బోగారం, సర్నేనిగూడెం, రామన్నపేట, ఇస్కిళ్ల, శోభనాద్రిపురం, జనంపల్లి, ఉత్తటూరు, 10న సూరారం, పల్లివాడలో, 11న నీర్నెముల, బాచుప్పలలో, సిరిపురం, లక్ష్మాపురం, కక్కిరేణి, కొత్తగూడెం, తుమ్మలగూడెంలలో, 13న వెల్లంకి, ఎన్నారం, బి.తుర్కపల్లి, దుబ్బాక, నిధానపల్లి, కొమ్మాయిగూడెం, కుంకుడుపాములలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 14న మండల కేంద్రంలో ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

హామీలు తప్పకుండా అమలు చేయాలి


మాట్లాడుతున్న కందాల ప్రమీల

కేతేపల్లి: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు. గురువారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్థుమారయ్య, నాయకులు కోట లింగయ్య, ఎల్.రాజు, సీహెచ్.నాగయ్య, గుండగాని శ్రీను, వంగూరి వెంకన్న, ఊర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి


మాట్లాడుతున్న సంక్షేమ అధికారి కృష్ణవేణి

కొండమల్లేపల్లి : గ్రామాల్లో భ్రూణ హత్యలు, లింగ వివక్ష, బాల్యవివాహాలు జరగకుండా అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో తమవంతుగా తగిన బాధ్యతను పోషించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలో ఉన్న రైతు వేదికలో గురువారం నిర్వహించిన మిషన్ వాత్సల్య విజ్ఞాన్ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో 'బేటి బచావో.. భేటి పడావో'అనే కార్యక్రమం ద్వారా ఆడపిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రతి నెలా రెండో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఉదయ, ఏసీడీఓ శాంతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పర్తి రాధ, మంజుల, వరలక్ష్మి, రజిత, తారకమ్మ, సువర్ణ, ప్రమీల, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, స్వాతి, సునిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జనావాసాల్లో వానరాల బీభత్సం

- మహిళలను, పిల్లలను గాయపరుస్తున్న కోతులు
- ఇబ్బందులు పడుతున్న నకిరేకల్ పట్టణ ప్రజలు
- నివారణ చర్యలు తీసుకోవాలని వేడుకోలు

నకిరేకల్: కోతులు, పందుల బెడద నకిరేకల్ మున్సిపాలిటీలో తీవ్రంగా ఉంది. ఇళ్ల మధ్య పందుల స్వైరవిహారంతో అపరిశుభ్రత నెలకొంటోంది. నకిరేకల్ పట్టణంలో జనాభా 40 వేల పై చిలుకు ఉన్నారు. రోజురోజుకూ విస్తరిస్తున్న నకిరేకల్ పట్టణంలో ఒకవైపు కోతులు, మరోవైపు కుక్కలు, ఇంకోవైపు పందులు ప్రజలను దడ పుట్టిస్తున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్‌ల్లో పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని అపరిశుభ్రం చేస్తున్నాయి. పట్టణంలోని మొత్తం 20 వార్డుల్లో ఇదే పరిస్థితి. నకిరేకల్‌లో కోతులు రాత్రి, పగలు సంచరిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

ఇళ్లపై పెంకులను తొలగిస్తున్న కోతులు

నకిరేకల్ పట్టణంలో కోతులు ఇళ్ల కప్పులపై ఎగురుతూ పెంకులను పగులగొడుతున్నాయి. కోతులు పెంకులను పగులగొట్టడం, ఊడదీయడం వల్ల కురవని పెంకుటిల్లు ఒక్కటికూడా లేకుండా పోయింది. ఆర్థిక స్థోమత కలవారు పెంకులను తీసి రేకుల కప్పు వేసుకుంటున్నారు. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వంట పాత్రలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పిల్లలను, మహిళలను గాయపరుస్తున్నాయి. కోతులకు భయపడి ఇళ్ల వద్ద గృహిణులు ఒంటరిగా ఉండాలంటే భయపడుతున్నారు. ఇంటి తలుపులు తీసి ఉంచితే ఇక అంతే సంగతులు. ఇంట్లో ఉన్న సరుకులు మాయంకాక తప్పడం లేదు. నిత్యం జనావాసాల్లో వానర సైన్యం స్వైర విహారం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో, పెరట్లో పెంచుకునే పండ్ల, పూల మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఇంటిపై ఉన్న కేబుల్ వైర్లు కూడా తెంపేస్తున్నాయి. తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరువ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. కోతుల నివారణకు మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతున్న కోతులు

కోతుల బెడద నివారించాలి



"కోతుల బెడద నివారణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలి. ఇంటి తలుపులు తెరిస్తే చాలు ఇంట్లోకి ప్రవేశించి కూరగాయలను, పండ్లను ఇతర వస్తువులను తీసుకెళ్తున్నాయి. ఒంటరిగా ఉన్న పిల్లల చేతుల్లోంచి తినుబండరాలను లాక్కెళ్తున్నాయి.

–పందాల వసంత, సుందరయ్యనగర్, నకిరేకల్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

మాడ్గులపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ జమీరోద్దీన్ సూచించారు. మండలంలోని పాములపాడు, ఆగామోత్కూర్, చిరుమర్తి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. 15శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రవాణాలో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ అక్తర్‌అలీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రామన్నపేట : మండలంలోని ఉత్తటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం హోమం నిర్వహించారు. ధ్వజస్తంబం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. శుక్రవారం యంత్రస్థాపన చేసి స్వామి వారి విగ్రహాన్ని ఆలయ ప్రతిష్ఠించనున్నారు. సర్పంచ్ కోళ్ల స్వామి, మాజీసర్పంచ్‌లు మంచిరాజు శరత్‌చందర్, జెట్టి బాలమల్లయ్య, పానుగోటి వెంకటేశ్వర్‌రావు, ఎడవల్లి దుర్గాప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

నీటి మడుగును తలపిస్తున్న సీసీ రోడ్డు


కేతేపల్లిలో సీసీరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కేతేపల్లి: మండల కేంద్రంలో శివాలయం నుంచి ముత్యాలమ్మ ఆలయం వద్దకు వెళ్లే దారిలో సీసీరోడ్డు మీద వర్షపు నీరు నిలిచి గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించే సమయంలో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా రోడ్డు వేశారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. వర్షాలు కురిసినప్పుడు సీసీ రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలుస్తుండడంతో మురుగు నీటి గుంతగా మారి కంపు కొడుతోందని ప్రజలు వాపోతున్నారు. సీసీ రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జ్యోతిరావ్‌పూలే భవన్‌గా మార్చడం శుభ పరిణామం

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌గా మార్చడం మంచి శుభపరిణామం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ బీసీలు ధన్యవాదాలను తెలియజేస్తున్నట్లు తెలిపారు. బీసీలందరూ హర్షించదగిన విషయమన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ : టీచర్ పోస్టుల భర్తీకి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని నూతన సీఎం రేవంత్‌రెడ్డిని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనకంచి వీరరాఘవులు, ఒంటెద్దు భిక్షంరెడ్డి కోరారు. గురువారం వారు స్థానికంగా మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నిర్వీర్యంగా ఉన్న విద్యావ్యవస్థను నూతన ప్రభుత్వం బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. ఎఫ్‌ఎల్‌ఎన్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నందున వాటిని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ..

చలి ఎక్కువ కావడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్ని దుస్తులు అమ్మే దుకాణాలు వీధుల వెంట వెలిశాయి. దీంతో నల్లగొండ పట్టణ ప్రజలతోపాటు వివిధ గ్రామాల ప్రజలు తమకు అవసరమైన స్వెటర్లు, బ్లాంకెట్లు,ఇయర్ క్యాప్స్ కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నల్లగొండ









నల్లగొండ జిల్లా కేంద్రంలో స్వెటర్లు, ఇయర్ క్యాప్స్, రెయిన్ కోట్‌లు, బ్లాంకెట్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు